క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన తిప్పమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 22,500 చెక్కు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డాక్టరేట్ పొందిన అయిజ వాసి



వీణాచారి

అయిజ/మానవపాడు: మానవపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న వి. వీణాచారి శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ స్టడీస్ ఆన్ అరివిలియస్ ఫేజ్ మల్టీఫెరోయిక్ కాంపౌండ్స్ అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మన్నరావు, మహేంద్రగౌడ్, కృష్ణ, స్వప్న, ఫౌజియా, ఫిరోజ్, షాన్వాజ్, సతీష్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

పశువులకు టీకాలు వేయించాలి



శాంతినగర్: పశువులకు తప్పనిసరిగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యురాలు స్వరూపరాణి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జిల్లెడుదిన్నెలో శాంతినగర్ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు శనివారం లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న టీకాలను పశువులకు వేయించి ముద్దచర్మ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, బుచ్చమ్మ, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు అరికట్టాలి



వనపర్తి రూరల్: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, వెంటనే వాటి అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జె రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపాలకృష్ణ కోరారు. శనివారం వనపర్తి పట్టణంలో బండార్ నగర్ రేషన్ షాపును వారు సందర్శించి బియ్యం పంపిణీని పరిశీలించారు. వినియోగదారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సక్రమంగా బియ్యం సరఫరా చేయక పలు దుకాణాలు మూతపడ్డాయన్నారు. రేషన్ కార్డులు పట్టుకొని ప్రజలు బియ్యం కోసం షాపుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పతిసారి అరకిలో బియ్యం తరుగు తీస్తున్నారు. ఇదేమి అని లబ్ధిదారులు ప్రశ్నిస్తే మాకు సరఫరా చేస్తున్న బియ్యం సంచులు తరుగు వస్తుందని చెవుతున్నారన్నారు. ఈ నెల జారీ అయిన అన్ని రేషన్ కార్డులకు బియ్యం పంపిణీ చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎర్ర కురుమన్న పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం, ఉపాధ్యక్షుడు నవీన శ్రీను, ప్రధాన కార్యదర్శి తాఫీఖ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఫొటో స్టూడియోల నిర్వాహకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు అత్యాధునిక కెమెరాలు ఉచితంగా ఇవ్వాలని, రూ.10 లక్షలు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

చిగురిస్తున్న రైతుల ఆశలు



బి.తిమ్మాపూర్‌లో సాగుచేసిన వేరుశనగ పంట

- విత్తనాలు విత్తేందుకు అనుకూలం
- మొక్కలకు ప్రాణం పోసిన వానలు
- గత నెలలో వర్షాభావంతో ఆందోళన

అయిజ: ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం కాకముందే రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయి. మే నెలలోనే అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు పంట పొలాలను దుక్కిదున్ని చదును చేసి విత్తనాలు విత్తుకున్నారు. ఈ క్రమంలో విత్తనాలు విత్తిన 20 రోజుల వరకు వర్షాలు కురవక పోవడంతో పలువురి పంట పొలాల్లో విత్తనాలు భూమిలో మురిగిపోయాయి. మరి కొందరి రైతుల పొలాల్లో విత్తనాలు మొలకెత్తినా సరే భూమిలో తేమ లేకపోవడంతో వాడుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం రైతుల ఆశలకు రెక్కలు తొడిగింది. ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్న మొక్కలు ప్రాణం పోసుకున్నాయి. భూమిలో మొలకెత్తకుండా పొడిగానే ఉన్న విత్తనాలు మొలకెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మురిగిపోయిన విత్తనాలకు బదులు పొలాల్లో కొత్త విత్తనాలు విత్తుతున్నారు. వారం రోజులుగా ప్రతిరోజు తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అయిజ శివారులో చిగురించిన పత్తి మొక్కలు

50,000 ఎకరాల్లో సాగు

మండల పరిధిలో 57,637 ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉండగా 11,036 ఎకరాలు సాగుకు ప్రతికూలంగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50,000 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుకు సన్నద్ధమయ్యారు. మే నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు 12,404 ఎకరాల్లో కంది, 6,830 ఎకరాల్లో ఆముదం, 8,901 వేరుశనగ, 20,123 ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. సుమారు 2000 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

సాగు చేపట్టారు



మే నెలలో కురిసిన వర్షాలకు పలువురు రైతు లు పత్తి, కంది, వేరుశనగ తదితర పంటలు సాగు చేపట్టారు. ఈ క్రమంలో జూన్ మొదటివారం వరకు వర్షాలు పడక పోవడంతో పొలాల్లో విత్తనాలు మురిగిపోయాయి. రైతులు ఆశలు వదులుకుంటున్న సమయంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎండుతున్న మొక్కలు చిగురించాయి.

– రమేష్, రైతు, అయిజ

మొలకెత్తిన విత్తనాలు



మృగశిర కార్తె వచ్చిన వెంటనే కురిసిన భారీ వర్షాలు రైతుల కళ్లలో ఆనందం నింపాయి. ఇటీవల కురిసన వర్షాలకు భూమిలో అడుగు మేర తేమ చేరి విత్తనాలు, మొలకెత్తిన మొక్కలకు అనువుగా మారింది. ఇప్పుడిప్పుడే మొక్కలు చిగురిస్తున్నాయి. మండలంలో పంటల సాగుకు అనువైన వాతావరణం ఉంది.

– భీమేష్, రైతు, అయిజ

నిరుపేద కుటుంబానికి చేయూత



రేకుల దుకాణాన్ని అందజేస్తున్న సామాజిక బాధ్యత బృందం

గట్టు: మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో శనివారం సామాజిక బాధ్యత టీం నిరుపేద కుటుంబానికి చేయూతనందించారు. మాచర్లకు చెందిన ఆంజనేయులు మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా ఇటీవల అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. కుటుంబం గడవడం కష్టంగా మారడంతో సామాజిక బాధ్యత టీంను సంప్రదించాడు. స్పందించిన టీం సభ్యులు చిరు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రూ. 35 వేలు విలువ చేసే రేకుల దుకాణాన్ని అందజేశారు. కార్యక్రమంలో సామాజిక బాధ్యత టీం సభ్యులు అశోక్, ఆంజనేయులు, సంజీవ్‌కుమార్, బెంజుమెన్, నర్మద, మాచర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మన ‘ఊరి బడి’లో చేర్పించాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి

మల్దకల్: మన ఊరి పిల్లలను మన ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మల్లెందొడ్డి పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. బడి బయట చిన్నారులందరినీ తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రవిప్రసాద్‌గౌడ్

గద్వాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని జూలై 2023 నుంచి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, సమ్మె కాలపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకుల పని వేళలు శాస్త్రీయంగా నిర్ణయించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనుకూలంగా మార్చాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 50 పైబడి విద్యార్థులు ఉన్న చోట తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం ఇదే విధంగా ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తే ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోపాల్, రమేష్, రాజశేఖర్, లక్ష్మణ్, తిమ్మప్ప, ఆంజనేయులు, బీసన్న, రవికుమార్, రాముడు, చిరంజీవినాయుడు, తిరుమలేష్, భాస్కర్, కరుణాకర్, శ్రీకాంత్, బీచుపల్లి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇదిలాఉండగా, పెంట్లవెల్లి ఎస్ఐ రామన్‌గౌడు మౌనిక దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, నారాయణగౌడ్, మురళీధర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, కేశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

గోపాల్‌పేట: నాలుగు రోజుల క్రితం మండలంలోని పొలికెపాడు గ్రామంలో బస్టాండులో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు చేతికర్ర, చేయి, కాలును ధ్వంసం చేశారు. ఈ విషయంపై శనివారం పొలికెపాడు గ్రామానికి చెందిన యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇటువంటి పనులు చేసేవారికి తగిన శిక్ష పడేలా చూడాలని కోరారు. గ్రామంలో కొన్నిసార్లు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగి బాటిళ్లు రోడ్లపై వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎవరు ఈ పనులు చేస్తున్నారనే విషయాలు తెలుస్తాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

విప్లవ నాయకుడు చే గువేరా



చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గద్వాల: సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించి వారికి సింహ స్వప్నంగా నిలిచిన ప్రజావాది చే గువేరా అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. సామాన్యులకు విద్య, వైద్యం ఉచితంగా అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. శనివారం చే గువేరా జయంతిని పురస్కరించుకొని స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు చేగువేరా ఆశయాలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, వెంకటేష్, విజయ్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగించుకోవాలి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘భూ భారతి’ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రెవెన్యూ సదస్సులో భాగంగా 16న సోమవారం ఆఖరి సదస్సును మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుకనూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు భూసమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

‘భూ భారతి’తో సమస్యలు తీరేనా?



బొంకూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- ఒకటి, రెండు మాత్రమేనా సమస్యలపై మాత్రమే దరఖాస్తుల స్వీకరణ
- సదస్సులపై ప్రచారం కల్పించడంలో నిర్లక్ష్యం

ఉండవెల్లి: గత ప్రభుత్వం 2018లో భూ సమస్యల పరిష్కారానికి ధరణి చట్టాన్ని తీసుకొచ్చి గత రికార్డుల్లో పొందుపరిచిన వాటిని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. అగ్రిమెంట్లపై ఉన్న వాటిని సాదాబైనమాల ద్వారా ఆన్‌లైన్ చేసి రైతులకు ఉచితంగా పాస్‌పుస్తకాలు అందించారు. ధరణిలో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ప్రస్తుత ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలోనైనా ప్రయోజనం చేకూరుతుందా.. లేదా.. అనే రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గ్రామాల్లో ప్రజలకు సమాచారం ఇవ్వకుండా రెండు, మూడు సమస్యలకు మాత్రమే దరఖాస్తులు తీసుకుంటున్నారని మిగిలిన సమస్యలపై సంబంధం లేదని పక్కన పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3 నుంచి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ

అలంపూర్ నియోజకవర్గంలో ఉండవెల్లి మండలాన్ని రెండో విడతలో ఎంపిక చేశారు. మే నెలలో అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కంచుపాడు-2, భైరాపురం-2, మారమునగాల-3, తక్కశిల-19, ప్రాగటూరు-6, బస్వాపురం-3, శేరుపల్లె-0, ఇటిక్యాలపాడు-0, ఖానాపుర్-3, బొంకూరు-1, కలుగొట్ల-5, మెన్నిపాడు-21, చిన్న ఆముదాలపాడు-15 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదని ఇప్పటి వరకు 80 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

సందేహంలో రైతులు

ప్రభుత్వం, ఎండోమెంట్, అసైన్డ్, భూదాన్, భూమి పట్టాలను ప్రభుత్వం రద్దు చేసి స్వాధీనం చేసుకుంటుందా? అదే విధంగా తాతలు, తండ్రుల నాటి నుంచి కొడుకులు, మనవళ్ల వరకు సాగు చేసుకుంటు అగ్రిమెంట్ మీద ఉన్న భూములకు పట్టాలు అందిస్తారా? ఇలా అనేక సందేహాలతో రైతులు భూసమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నా.. రాష్ట్రంలో సరిపడా సర్వేయర్లు లేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..

పట్టాదారు పాస్‌పుస్తకం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. వారసత్వంగా మా తాత నుంచి, మా నాన్న నుంచి నాకు 2 ఎకరాల భూమి వచ్చింది. ఈ భూమికి సంబంధించి నేటికీ పట్టాదారు పాస్‌పుస్తకం రాలేదు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికైనా వస్తుందేమోనని ఆశతో ఎదురు చూస్తున్నా.

– లక్ష్మిరెడ్డి, ఉండవెల్లి

సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



జేసీబీతో ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ సబ్‌స్టేషన్ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. 2020లో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఐదేళ్లుగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఈ నెల 7వ తేదీన సాక్షి దినపత్రికలో ఇటీవల ‘సబ్ స్టేషన్ ప్రారంభమెప్పుడో’ కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ శనివారం జేసీబీతో ముళ్లపొదలు తొలగించే పనులు చేపట్టారు. సబ్‌స్టేషన్ పనులు ప్రారంభమవడంతో జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, కొంకల గ్రామాల రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం



ఇటిక్యాలలో యోగా డైట్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇటిక్యాల: మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని ఆయుష్ శాఖ మండల వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగా దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా రాష్ట్ర ఆయుష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాల్లో 17వ రోజు యోగా డైట్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల ప్రజలకు మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆయుష్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయుష్ శాఖ నేతృత్వంలో ప్రజా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు నరేష్, శివాని, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం హేయమైన చర్య



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

అయిజ: ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై మావోయిస్టుల హత్యా ప్రయత్నం హేయమైన చర్య అని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కో కన్వీనర్ వెంకటేష్ అన్నారు. ఏబీవీపీ నాయకులు శనివారం మండల కేంద్రంలో ప్లకార్డులు పట్టుకొని మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. కన్వీనర్ ఆదిత్య చేసిన తప్పేమిలేదని, హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, రాజ్యాంగానికి ప్రజాస్వామ్యానికి మద్దతు తెలపాలని మాత్రమే కోరారన్నారు. ఈ క్రమంలో ఆదిత్యపై ఆయుధాలతో హత్యకు యత్నించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులను పోలీసులు పట్టుకోవాలని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకేష్, నగర ఉపాధ్యక్షుడు నరేష్, శ్రీధర్‌రెడ్డి, శ్రీహరి, వీరశేఖర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గద్వాల: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చేపట్టిన చట్ట సవరణలు వ్యతిరేకిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు వెంకటస్వామి, నర్సింహ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన బేరర్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కులకు విఘాతం కల్గించేలా నాలగు లేబర్ కోడ్‌లను బలవంతంగా అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బ్రిటీష్ వారిపై పోరాటం చేసి సాధించుకున్న హక్కులను నేడు స్వదేశీ శక్తులే కాలరాస్తుండటం దారుమణమన్నారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహ, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



ధరూరులో రక్తదాన శిబిరంలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది

ధరూరు: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గద్వాల బ్లడ్ బ్యాంక్ డాక్టర్ వెనీమా అన్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రక్తదాన శిబిర కార్యక్రమంలో హాజరై వారు మాట్లాడారు. ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా 20 సార్ల వరకు రక్తదానం చేసిన దాతలను ప్రశంసా పత్రంతో పాటు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాకేష్, ఖాజాపాషా, అబ్రహం, నౌషద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.